క్లుప్తంగా

యువత క్రీడలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న సీఐ జగదీశ్

సుల్తానాబాద్‌రూరల్: యువత వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టిసారించాలని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో డబుల్ బ్యాడ్మింటన్ పోటీలను సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పోటీలను సీఐ ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ యువతకు క్రీడలపై దృష్టిపెట్టాలనే ఉద్దేశంతోనే పోలీసుల ఆధ్వర్యంలో డబుల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు వినీత, వెంకటకృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, పోలీసు సిబ్బంది, క్రీడాకారులున్నారు.

నూతన డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: బెస్ట్ ఫర్ బెటర్ సొసైటీ ముద్రించిన 2024 డైరీని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. జీఎం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మద్దెల దినేశ్, సభ్యులు మండల శ్రీనివాస్, అనిల్‌కుమార్, నరేంద్ర, చందు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ధర్మారం ఎన్పీడీసీఎల్ అదనపు సహాయక ఇంజనీర్ ఖాన్ తెలిపారు. మండలంలోని ధర్మారం, మల్లాపూర్, కొత్తూరు, ఖిలావనపర్తి, రచ్చపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించటంతో పాటు మరమ్మతు పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిత్యావసరాలు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సింగరేణి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈశ్వరకృప వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను అందజేశారు. ఆర్జీ–3 ఏరియా పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి చేతుల మీదుగా రెండు క్వింటాళ్ల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఆశ్రమం అధ్యక్షుడు స్వామి, రాములు, శ్రీనివాస్, రాజన్న, సుధాకర్, సదానందం, గోపాల్, సదయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై అవగాహన

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై మండలంలోని నాగారం గ్రామంలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు కొంద్ర వెంకన్నగౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, ఇల్లందుల మల్లేశం, దీకొండ శ్రవణ్, సలేంద్ర రాజన్న, రమ, రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

నేడు పంచాయతీ భవనం ప్రారంభం


నూతన కార్యాలయ భవనం

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు.

డ్రమ్ సీడర్ సాగుపై అవగాహన

ముత్తారం: ముత్తారంలో శుక్రవారం డ్రమ్ సీడర్‌తో సాగు చేసిన రైతులకు మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ అవగాహన కల్పించారు. డ్రమ్ సీడ్ సాగు చేసిన రైతులు వరిపంట సక్రమంగా లేకపోతే వ్యవసాయ అధికారుల సలహా సూచనలు తీసుకోవాలన్నారు. వరికి చేపట్టే నివారణ చర్యలను వివరించారు. రైతులు చింతిరెడ్డి బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

స్వామి వివేకానంద జయంతి


గోదావరిఖని: పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు


మంథని: నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్మన్ మధు

స్వామి వివేకానందుడి జయంతి శుక్రవారం జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం, రక్తదానం చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


పెద్దపల్లిరూరల్: రక్తదానం చేస్తున్న నాయకులు


జ్యోతినగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు


కాల్వశ్రీరాంపూర్: బస్టాండ్ చౌరస్తాలో..


గోదావరిఖనిటౌన్: కళాశాల సిబ్బంది..


యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రతి డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తా

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లో రూ.20లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు కల్వర్టులు, రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోదావరిఖని 46వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో రూ.20లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు కల్వర్టులు, రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకవస్తే సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి, కార్పొరేటర్ పాతిపల్లి లక్ష్మిఎల్లయ్య పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

గోదావరిఖని: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కండేయకాలనీలోని ఆర్కేగార్డెన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారం చేసే దిశగా అడుగులు వేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత లక్ష్యసాధన దిశగా పయనించాలి

గోదావరిఖనిటౌన్: లక్ష్యసాధన దిశగా యువత పయనించాలని, ధైర్యంగా ముందుకెళ్లాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కాకతీయ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై నివాళి అర్పించారు. రంగోళి, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతి అందజేశారు. ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.యాదవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలేశ్వరం వెంకటేశ్, జ్యోతి, దాసరి సాంబమూర్తి, ఎం.హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, డాక్టర్ ఎస్.నారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



రేకుర్తికి తరలిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలను చేయించడానికి రామగుండం లయన్స్ క్లబ్ ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం సుమారు 30మంది పేద వృద్ధులను కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బంక కళావతి, కోశాధికారి మనీషా అగర్వాల్ తరలించారు. సీనియర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు మేడిశెట్టి గంగాధర్, తానిపర్తి గోపాల్‌రావు, బంక రామస్వామి, కజాంపురం రాజేందర్, మనోజ్‌కుమార్ అగర్వాల్, డి.లక్ష్మారెడ్డి, భేణిగోపాల్ త్రివేది, పాకాల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

యువజన అవార్డు గ్రహీతకు సన్మానం

ఎలిగేడు: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో మండలంలోని ధూళికట్టకు చెందిన సామాజిక సేవకులు జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవియాదవ్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సన్మానించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా యువజన క్రీడాధికారి సురేశ్ పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న దయానంద్‌గాంధీ

జ్యోతినగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని స్కేటింగ్ రింక్ గ్రౌండ్ వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాంపియన్ షిప్ పోటీలను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ అధికారులు, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

17న సమ్మక్క జాతర బహిరంగ వేలం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా సీల్డు టెండర్ కం బహిరంగ వేలం 17న జాతర ప్రాంతంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి శంకరయ్య తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతరలో కొబ్బరి కాయలు, బెల్లం, లడ్డు, పులిహోర ప్రసాదం, పుట్నాలు, ప్యాలాలు, తలనీలాలు, కోళ్లు అమ్ముకోవడానికి ధరావత్ రూ.20వేలుగా నిర్ణయించారు. ఆసక్తి గల వారు రూ.100 చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

★ **ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత**

మంథని: క్రైస్తవులు ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలిగి ఉంటారని తిరుపతికి చెందిన పాస్టర్ ఎంఎస్ ఎబినేజర్ అన్నారు. శుక్రవారం మంథనిలోని సియోను ప్రార్థనా మందిరంలో జరిగిన నూతన సంవత్సర ఆశీర్వాద కూడికలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు బైబిల్ చదువుతూ ప్రార్థనలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సియోను ప్రార్థనా మందిరం పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, పెంద్రు ప్రసన్న, అజ్మీరా దయారాజ్, మంథని మార్క్ కలువల సామ్యూల్, సంఘం పెద్దలు అంకరి కుమార్, జోసెఫ్, మంథని ప్రసాద్, రామగిరి కుమార్ ఉన్నారు.

★ **రైతులను ఆదుకునేందుకు రుణాలు**

మంథని: సన్న, చిన్నకారు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రుణాలు అందిస్తున్నట్లు మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పలువురు రైతులకు రూ.12లక్షల దీర్ఘకాలిక రుణాల కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, దేవళ్ల విజయ్‌కుమార్, సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ ఉన్నారు.

★ **ఆయన నేత్రాలు సజీవం**

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం పెద్దంపేట్ గ్రామానికి చెందిన చింతపట్ల రాజయ్య (55) అనే ప్రైవేట్ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. రాజయ్య నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు రామకృష్ణారెడ్డి, భీష్మచారి, చంద్రమౌళి, వాసు అభినందించారు.

★ **అనారోగ్యంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతి**

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ సివిల్ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బీ.ఎస్.ఆర్ ఆంజనేయులు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆంజనేయులు సెంటినరీకాలనీలో నివాసం ఉంటున్నాడు. కరోనా సమయంలో ఆయన కాలనీవాసులకు ఎన్నో సేవలు అందించారు. ఆయన మృతిపై ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సివిల్ డీజీఎం పద్మరాజు సంతాపం తెలిపారు.

★ **తృటిలో తప్పిన ప్రమాదం**

జ్యోతినగర్: లారీ, ఆటో ట్రాలీ ఢీకొన్న ఘటనలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల రాజీవ్ రహదారిపై మహారాష్ట్ర నుంచి గుంటూరుకు వెళ్తున్న లారీని అదే రోడ్డుపై దేవాపూర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఆటో ట్రాలీని.. లారీ వెనుకభాగంలో ఢీకొన్నది. దీంతో ఆటో ట్రాలీ ముందు భాగం గ్లాసులు పగిలాయి. ఆటోడ్రైవర్ షారూఖ్, లారీ డ్రైవర్ బాలకృష్ణతో పాటు ఆటోలో ఉన్న మరో ముగ్గురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎన్టీపీసీ పోలీసులు ప్రమాదస్థలాన్ని సందర్శించి రోడ్డుపై ఉన్న ట్రాలీని తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

★ **దరఖాస్తుల ఆహ్వానం**

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో 6, 10వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

★ **లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు**

జూలపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ శివమ్ ఆధ్వర్యంలో జూలపల్లిలోని మార్కండేయ ఆలయ సమీపంలో షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

★ **ప్రజాపాలన డాటా ఎంట్రీ పూర్తి**

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ శుక్రవారం పూర్తయినట్లు మండల పరిషత్ అధికారి మోతె సమ్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డాటా ఎంట్రీ పనుల పనితీరును పరిశీలించారు. మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో 8,085 దరఖాస్తులు వచ్చాయని ఆయన వెల్లడించారు.

★ **నేత్రదాత కుటుంబానికి అభినందన**

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు జెట్టి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శుక్రవారం నేత్రదాత మల్లయ్య సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, కే.ఎస్.వాసు కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

వివేకానందుని ఆశయాలను కొనసాగించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: స్వామి వివేకానందుని ఆశయాలను యువత కొనసాగించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శుక్రవారం వివేకానందుని జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని వివేకానందుని విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఏబీవీపీ ఆధ్వర్యంలో వేరువేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామల రాజేంద్రప్రసాద్‌తో పాటు శివాలయం అర్చకులు వడ్లకొండ మహేశ్, వడ్లకొండ రమేశ్ ఎమ్మెల్యేను సత్కరించారు. మీ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సామల రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టు సామల హరికృష్ణ, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ రేకులపల్లి శశాంక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయాలి

- ఎంపీపీ ముత్తయ్య
- అధికారుల పనితీరు సరిగా లేదని ప్రజాప్రతినిధుల ఆందోళన


నిరసన తెలుపుతున్న సర్పంచ్ రమేశ్

ముత్తారం: గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీల సమన్వయంతో అధికారులు జవాబుదారీగా పనిచేయాలని ఎంపీపీ జక్కుల ముత్తయ్య సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగా సమావేశంలో అధికారులకు నిరసన సెగ ఎదురైంది. మండలంలోని వివిధశాఖల అధికారుల పనితీరు బాగా లేదని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఖమ్మంపల్లి సర్పంచ్ సముద్రాల రమేశ్, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమావేశం పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ జోక్యం చేసుకుని ఖమ్మంపల్లి పంచాయతీలో విచారణ చేపట్టి సర్పంచ్‌కి న్యాయం చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. దీంతో సర్పంచ్ ఆందోళన విరమించారు. తర్వాత మండలంలో మిషన్ భగీరథలో అవకతవకలు జరిగాయని, పైప్‌లైన్ పగిలినా పట్టించుకోవడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గత మండల సభలో తీర్మానాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రతిసారి సభను నామమాత్రంగా నిర్వహించడం సరికాదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


సుల్తానాబాద్: శ్రీవాణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో..


కమాన్‌పూర్: ఆపిల్ కిడ్స్ పాఠశాలలో..


పెద్దపల్లిరూరల్: కాసులపల్లి ట్రినిటి స్కూల్‌లో..


ధర్మారం: హరిదాసు వేషధారణ..


ముత్తారం: పోతారంలో జ్ఞాపిక బహూకరణ


రామగుండం: వేడుకల్లో సీడీపీవో స్వరూపరాణి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగిమంటలు వేశారు. రేగుపండ్ల తలంబ్రాలు, రైతుల వేషధారణలో వరినాట్లు వేయటం, బొమ్మల కొలువు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

వేంకటేశ్వరాలయంలో కూడారై ఉత్సవాలు


జ్యోతినగర్: ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

జ్యోతినగర్: శ్రీవేంకటేశ్వరాలయంలో కూడారై ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వానమామలై రామాచార్యులు, విష్ణు సహస్రనామ సమితి, హరిహర దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు పాయసం వితరణ చేశారు. ఆలయ పూజారులు బండవరం రంగనాథచార్యులు, వేణు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం గోదారంగనాయకుల స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దాంతోపాటు కూడారై వేడుకను కూడా నిర్వహించారు.

బీకే బిర్లా జయంతి


నివాళి అర్పిస్తున్న మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: బి.కె.బిర్లా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత బసంత్‌కుమార్ బిర్లా జయంతి శుక్రవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో నిర్వహించారు. కంపెనీ ప్రధాన గేట్ వద్ద బిర్లా చిత్రపటానికి కంపెనీ ఉద్యోగులు, అధికారులు, నివాళి అర్పించారు. పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి


మాట్లాడుతున్న మనాలి ఠాకూర్

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత ఏలేశ్వరం వెంకటేశ్, ఎన్‌వైపీ కోఆర్డినేటర్ యాదవరాజు, మాజీ కార్పొరేటర్ దాసరి ఉమాసాంబమూర్తి అధ్యాపకులు సంతోష్, ఎస్.శంకర్ పాల్గొన్నారు.